నమస్తే తెలంగాణ
వికారాబాద్
11 | హైదరాబాద్, సోమవారం 25 మార్చి 2024 | VIKARABAD

ఎమ్మెల్సీ.. 'పోరు' రసవత్తరం !

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ప్రతిష్టాత్మకంగా మారిన ఎమ్మెల్సీ ఎన్నికలు

- సంఖ్యా పరంగా బీఆర్ఎస్‌కు మెజార్టీ సభ్యుల మద్దతు
- 'ఆపరేషన్ ఆకర్ష్'ను ముమ్మరం చేసిన కాంగ్రెస్
- క్యాంపుల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు
- ఈనెల 28న ఎన్నిక.. రంగారెడ్డి జిల్లాలో 171 మంది ఓటర్లు



రంగారెడ్డి, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోరు రసవత్తరంగా మారింది. గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు హోరాహోరీగా పోరు సాగిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు ముందు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికను ఇరు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్ల బలం ఎక్కువగా ఉండడంతో బీఆర్ఎస్ పార్టీ గెలుపుపై ధీమాగా ఉన్నది. ఇదే స్థానంపై గెలుపు ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరలేపింది. ఈ నేపథ్యంలో ఓటర్లు చేజారిపోకుండా ఉండేందుకు ఎవరికివారు క్యాంపులకు తరలించారు. ఈనెల 28న జరుగనున్న ఈ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా నుంచి 171 మంది ఓటింగ్‌లో పాల్గొననున్నారు.

వ్యూహాలకు పదును..

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి బీఆర్ఎస్ నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి యువ పారిశ్రామిక వేత్త మన్నె జీవన్‌రెడ్డిలు బరిలో ఉన్నారు. స్వతంత్రంగా పోటీ చేస్తున్న సుదర్శన్‌గౌడ్ ప్రభావం నామమాత్రమే. పార్లమెంట్ ఎన్నికలకు ముందు జరుగుతున్న ఎన్నిక కావడంతో ఇరు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఈ ఎన్నికలో ఓటమి ప్రభావం పార్లమెంట్ ఎన్నికలపై పడనుండడంతో అధికార పార్టీ కాంగ్రెస్‌కు గుబులు పట్టుకున్నది. మెజార్టీ ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఉండడంతో ఓటమి ఖాయం అనుకున్న కాంగ్రెస్... బీఆర్ఎస్ నుంచి వలసలను ప్రోత్సహిస్తున్నది. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు గాలం వేసి కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. డబ్బులను ఎరగా చూపడం.. లేదంటే ! బలప్రయోగానికి, అధికార దుర్వినియోగానికి సైతం పాల్పడేందుకు పూనుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఈ పరిస్థితుల్లో ఇరు పార్టీలు ఓటర్లను క్యాంపులకు తరలించారు. బీఆర్ఎస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల పర్యవేక్షణలో బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులను క్యాంపులకు తరలించింది. దీంతో కాంగ్రెస్ పార్టీకి ఓటమి భయం పట్టుకున్నది. ఈనెల 28న ప్రజాప్రతినిధులను నేరుగా పోలింగ్ కేంద్రాలకు చేర్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రభావం చూపనున్న జిల్లా ఓటర్లు..

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓటర్లు ప్రభావం చూపనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 1,439 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో జడ్పీటీసీలు 83 మంది, ఎంపీటీసీలు 888 మంది, మున్సిపల్ కౌన్సిలర్లు 449 మంది, ఎక్స్ ఆఫీషియో సభ్యులు 19 మంది ఉన్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, గద్వాల తర్వాత అత్యధికంగా 171 మంది ఓటర్లు షాద్‌నగర్ నియోజకవర్గంలోనే ఉన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, కొత్తూరు, చౌదరిగూడెం, నందిగామ మండలాల సభ్యులు ఓటింగ్‌లో పాల్గొననున్నారు. సంఖ్యాపరంగానూ ఇందులో మెజార్టీ సభ్యులు బీఆర్ఎస్‌కు చెందిన వారే ఉన్నారు. వీరంతా షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రంలోనే ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బీఆర్ఎస్‌కు మెజార్టీ సభ్యుల బలం ఉండగా.. అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై ప్రస్తుతం అన్నివర్గాల్లోనూ తీవ్ర వ్యతిరేకత ఉన్నది. ఇవన్నీ కూడా బీఆర్ఎస్‌కు అనుకూలించే అంశాలని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపును చేపట్టనుండగా.. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే ఈ ఉప ఎన్నిక ఫలితంపై సర్వత్రా ఉత్కంఠత నెలకొన్నది.

భువనగిరి కోటపై స్థానికులకు అవకాశం..

ఇప్పటివరకు ఎన్నికైన వారిలో స్థానికేతరులే అధికం

తొలిసారి స్థానికుడు మల్లేష్‌కు అవకాశం కల్పించిన కేసీఆర్

బీసీల్లో కురుమగొల్లకు దక్కిన చాన్స్

ఇబ్రహీంపట్నం, మార్చి 24 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన అభ్యర్థికి మొట్టమొదటిసారిగా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్థానం కల్పించారు. నియోజకవర్గం ఇప్పటి వరకు నల్లగొండ, తర్వాత భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉండేవి. ఈ స్థానం నుంచి ఇప్పటి వరకు నల్లగొండ జిల్లాకు చెందినవారే ప్రాతినిధ్యం వహించారు. ఈ నియోజకవర్గం నుంచి ధర్మభిక్షం, సురవరం సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు వంటి నల్లగొండ జిల్లా నేతలే ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత భువనగిరి పార్లమెంట్ పరిధిలోకి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం చేరింది. ఈ నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందారు. అలాగే, బీఆర్ఎస్ నుంచి బూర నర్సయ్యగౌడ్‌లు ప్రాతినిధ్యం వహించారు. కానీ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన ఏ ఒక్క నాయకుడికి అవకాశం లభించలేదు. ఈసారి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇబ్రహీంపట్నానికి చెందిన బలమైన బీసీ నాయకుడికి చాన్స్ ఇచ్చారు. రాష్ట్రంలోనే గొల్లకురుమలకు చెందిన క్యామ మల్లేష్‌కు తొలిసారిగా కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికల్లో స్థానం కల్పించారు. దీంతో బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. క్యామ మల్లేష్ ఇప్పటికే ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా మల్‌రెడ్డి రాంరెడ్డి ఉండడంతో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆయన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడితో పాటు కాంగ్రెస్ పార్టీలో అనేక పదవీబాధ్యతలు నిర్వర్తించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గొల్లకురుమలకు సుమారు 52వేల పైచిలుకు ఓట్లు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా గొల్లకుర్మలకే ఓట్లున్నాయి. అలాగే, గౌడ్‌లకు 48వేలు, ముదిరాజులకు 28వేలు, మునూరు కాపులకు 13వేలు, ఎస్సీలకు 26వేలు, ఎస్టీలకు 27వేల ఓట్లు ఉన్నాయి. దీంతో రాజకీయాలకతీతంగా బీసీ నాయకులు మద్దతు ప్రకటిస్తుండడంతో విజయం సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

తొలిసారి స్థానిక నేతకు చాన్స్..

భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఇప్పటి వరకు స్థానికేతరులే పోటీ చేశారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి, భూర నర్సయ్యలు స్థానికేతరులే. ఈ ఎన్నికల్లో క్యామ మల్లేష్ గెలుపొందితే తొలిసారి స్థానికుడవుతారు. భువనగిరి ఎంపీ పరిధిలో ఇబ్రహీంపట్నం, మునుగోడు, భువనగిరి, ఆలేరు, జనగామ, తుంగతుర్తి నియోజకవర్గాలు ఉన్నాయి. స్థానికుడికి అవకాశం కల్పించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన చతురతను చాటుకున్నారు.

క్యామ మల్లేష్

- కేసీఆర్‌ను నిషాన లేకుండా చేస్తావా..?.. రేవంత్ ఎందుకింత అహంకారం ?
- విమర్శలు మానుకొని.. ప్రజా సేవ చెయ్యి
- నువ్వు రాకపోకలు సాగించే ఫ్లైఓవర్లు.. కేసీఆర్ వేసినవే.. కనిపిస్తలేవా.?
- కేసీఆర్ పెట్టిన భిక్షతోనే రంజిత్ రెడ్డి ఎంపీ అయ్యాడు
- మోసకారి రంజిత్ రెడ్డికి గుణపాఠం చెప్పాలి
- కాంగ్రెస్, బీజేపీ అబద్ధపు వాగ్దానాలను నమ్మి మరోమారు మోసపోవద్దు
- బీఆర్ఎస్ అభ్యర్థి కాసానిని గెలిపించుకుందాం.. ఐదేండ్లు సేవ చేయించుకుందాం
- సన్నాహక సమావేశంలో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- సేవ చేసేందుకు ఒక్కసారి అవకాశం ఇవ్వండి..
- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పక్కన ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, వాణీదేవి, దయానంద్‌గుప్తా తదితరులు

పదేండ్లలో లేని కరువు.. వంద రోజుల్లోనే ఎందుకొచ్చింది

రెండు నెలలు కష్ట పడుదాం

సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్. రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి ఆయన ఎంతో సేవ చేశారు. ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపిస్తాం. ఎంపీ రంజిత్ రెడ్డి ఐదేండ్ల కాలంలోనే కోట్ల రూపాయలు సంపాదించుకొని పార్టీ మారారు. కేసీఆర్ పాలనలో చెరువులు ఎప్పుడూ నిండు కుండలా ఉండేవి. కాంగ్రెస్ పాలన వచ్చిన వంద రోజుల్లోనే చెరువులు ఎండి పోతున్నాయి. రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపిస్తు కలుగడంలేదు. పదేండ్లలో లేని కరువు.. కాంగ్రెస్ వచ్చిన వంద రోజుల్లోనే కరువు ఎందుకొచ్చింది. రెండు నెలలు కష్ట పడుదాం.. కాసానిని ఎంపీగా గెలిపించుకుందాం. ఐదు సంవత్సరాలు పని చేయించుకుందాం.

– ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, కాలె యాదయ్య

బడంగ్‌పేట, మార్చి 24 : చేవెళ్ల పార్లమెంట్ నుంచి ఎంపీగా గెలిపిస్తే సబండ వర్గాలకు సేవ చేస్తానని చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని సామ యాదిరెడ్డి గార్డెన్‌లో ఆదివారం చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాజేందర్‌నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు వాణీదేవి, ఎగ్గే మల్లేశం, బుగ్గారపు దయానంద్ గుప్త, తదితరులు హాజరయ్యారు. మహేశ్వరం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి.. కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని శపథం చేశారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు పి.సబితా ఇంద్రారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య సంపూర్ణంగా మద్దతు ప్రకటించడంతో వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని, కార్యకర్తలు శ్రమించకుండా ఏ లీడర్ గెలువలేడన్నారు. గతంలో జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పని చేసి ఎంతో మార్పు తీసుకొచ్చానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, ఉపాధ్యక్షుడు చంద్రయ్య, మీర్‌పేట మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, మీర్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్ రెడ్డి, బడంగ్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, ఆర్కేపురం అధ్యక్షుడు నాగేశ్, మహేశ్వరం అధ్యక్షుడు రాజు నాయక్, కందుకూరు అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్, తుక్కుగూడ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మయ్య, మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య బీరప్ప, జిల్లెల కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌ల , బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో కాంగ్రెస్ తెచ్చిన మార్పు.. పంటలు ఎండబెట్టడమే..

– మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకార పూరితంగా మాట్లాడుతున్నాడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం కోసం 14 సంవత్సరాలు పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను నిషాన లేకుండా చేస్తావా.?ఎందుకు ఇంత అహంకారమని రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కరెంటు కోతలు, రైతుల పంటలు ఎండబెట్టడం, రైతుబంధు నిలిపివేత ఇలా అనేక మార్పులు తీసుకువచ్చిదని తెలిపారు. కేసీఆర్ ఏం చేశాడో రేవంత్ రెడ్డికి కనిపిస్తలేదా..? రేవంత్ రాకపోకలు సాగిస్తున్న ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, విశాలంగా మారిన రోడ్లు కేసీఆర్ వేసినవేనని తెలుసుకోవాలని హితవు పలికారు. ప్రజలకు మిషన్ భగీరథ నీళ్లలో కేసీఆర్ కన్పిస్తున్నడు, రైతు బంధు, రైతు బీమా, పింఛన్లు, ఇలా అనేక సంక్షేమ పథకాల రూపంలో కేసీఆర్ కన్పిస్తున్నాడన్నారు. కేసీఆర్ పెట్టిన భిక్షతో రంజిత్ రెడ్డి చేవెళ్లకు ఎంపీగా గెలిచారని, అంతకు ముందు ఎవరికీ తెలియదన్నారు. భిక్ష పెట్టిన కేసీఆర్‌నే స్వార్థంకోసం మోసంచేసి కాంగ్రెస్‌లో చేరారని.. ఇలాంటి మోసకారి రంజిత్ రెడ్డికి గుణపాఠం చెప్పాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్‌కు కాసాని జ్ఞానేశ్వర్ సుపరిచితుడని తెలిపారు. గతంలో జెడ్పీ చైర్‌పర్మన్‌గా, ఎమ్మెల్సీగా 96కులాల గొంతుకగా పనిచేసిన నిబద్ధత గల నాయకుడికి మహేశ్వరం నియోజకవర్గం నుంచి 60వేల మెజార్టీ ఇద్దామని, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ అబద్ధపు వాగ్దానాలను నమ్మి మరోమారు మోసపోవద్దని ప్రజలకు సూచించారు.

కాంగ్రెస్ వచ్చింది.. జనరేటర్లు తెచ్చింది

కాంగ్రెస్ పాలన వందరోజులు కాక ముందే జనరేటర్లు తీసుకువచ్చింది. ప్రజలందరినీ అంతర్మథనంలో పడేసింది. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ప్రజా సంక్షేమ పథకాలను అన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నిలివేస్తున్నది. కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఎంపీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. బీజేపీ చేస్తున్న ఆరాచకాలను, కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలి.

– ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, వాణీదేవి, దయానంద్ గుప్త

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నేతలు, కార్య కర్తలు

మీ ప్రాంత బిడ్డను ఆశీర్వదించండి

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధికి కృషి చేస్తా

బహుజన వాదం- తెలంగాణ వాదం ఒక్కటే..

భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉన్నది, బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చుతారు..

బీఆర్ఎస్ పార్టీ నాయకులపై కాంగ్రెస్, బీజేపీలు అక్రమ కేసులు పెడుతున్నయ్

ఎంపీ అభ్యర్థిగా అవకాశమిచ్చినందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు

బ్లాక్ వాయిస్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు, మార్చి 24 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తా.. మీ ప్రాంత బిడ్డను రాజకీయాలకు అతీతంగా నన్ను ఆశీర్వదించండి.. అని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మాడ్గుల మండలంలోని అప్పరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఆర్ఎస్‌పీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్ఎస్‌పీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందే బీఆర్ఎస్ నాయకులు, బ్లాక్ వాయిస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆర్ఎస్ ప్రవీణ్‌కు ఘనస్వాగతం పలికారు. పూలమాలలు శాలువలతో ఘనంగా సత్కరించారు. సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ ఫిట్‌నెస్ సెంటర్‌ను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. తదనంతరం సావిత్రిబాయిపూలే గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రామంలో సిలిండర్ పేలి నిరాశ్రయులైన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆర్ఎస్‌పీ మాట్లాడుతూ పేదరికంలో పుట్టి ఐపీఎస్ సాధించానని, గురుకుల కార్యదర్శిగా పని చేసి లక్షల మందిని ఉన్నత విద్యావంతులుగా, ఉన్నత స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దానన్నారు. బహుజన వాదం తెలంగాణ వాదం ఒక్కటేనని, బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానే మారుస్తుందని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నాయని, ఇలాంటి చర్యలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒడిగట్టడం సమాజహితం కాదన్నారు. తెలంగాణ బ్లాక్ వాయిస్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ గోవింద్ శ్రీదర్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల ఓటర్లు పార్టీలకు అతీతంగా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇచ్చిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, తెలంగాణ బ్లాక్ వాయిస్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ గోవింద్ శ్రీదర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లాలయ్య గౌడ్, సురమల్ల సత్తయ్య, కొమ్ము శ్రీనివాస్ యాదవ్, సింగల్‌విండో డైరెక్టర్ రాజవర్ధన్ రెడ్డి, గొర్రె పవన్‌కుమార్‌రెడ్డి, జంతుక అల్లాజీ, యాదయ్య, నిరంజన్, బీఆర్ఎస్ యువ నాయకులు పోలె మహేష్, బద్ది రాజు, కొండల్‌యాదవ్, బ్లాక్ వాయిస్ సభ్యులు కిరణ్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పక్కన జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ తదితరులు